క్లుప్తంగా

నీరు నిల్వ లేకుండా చర్యలు



జేసీబీతో పనులు చేయిస్తున్న ప్రశాంత్

వాంకిడి: మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి మండల కేంద్రంలోని పలు కాలనీల ప్రజలు వరద నీటితో ఇబ్బందులు పడ్డారు. వాంకిడిలోని న్యూ బస్టాండ్ ప్రాంతంలో వరద నీరు భారీగా చేరడంతో కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్ తన సొంత ఖర్చులతో నీటిని తరలించేలా జేసీబీతో చర్యలు తీసుకున్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే



అమ్మవారిని దర్శించుకుంటున్న కోవ లక్ష్మి

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయాన్ని బుధవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి సందర్శించారు. శ్రావణమాసం సందర్భంగా అమ్మవారితో పాటు ఆలయ ప్రాంగణంలో ఉన్న కాలభైరవ స్వామిని దర్శించుకుని ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయంలో అమ్మవారి మహాత్యాన్ని చూడడం, వినడం ఇదే మొదటిసారన్నారు. ఎమ్మెల్యేను ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్, ఆలయ కమిటీ అధ్యక్షుడు మోడెం తిరుపతిగౌడ్‌లు శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

‘ఆంధ్రవాళ్లకే కాంట్రాక్టులు ఇస్తున్న కాంగ్రెస్’

కౌటాల: కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టులన్నీ ఆంధ్ర కాంట్రాక్టర్లకు అప్పగిస్తుందని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. బుధవారం రాత్రి కౌటాల మండలం ముత్తంపేట గ్రామంలో గురుడుపేట, ముత్తంపేట గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ రేవంత్ సర్కార్ కాంట్రాక్టులను బీజేపీ ఎంపీ సీఎం రమేశ్‌కు అప్పగించిందని ఆరోపించారు. కాంట్రాక్టుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని తెలిపారు. మాజీ ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, నాయకులు శ్యాంరావు, నాందేవ్, సత్యనారాయణ, సోమయ్య, సందీప్, నవీన్, ఆనంద్‌రావ్, బండు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆదాయం పెంచేందుకు కృషి

నార్నూర్: రైతుల ఆదాయం పెంచేందుకు కృషి చేస్తామని పీఏసీఎస్ సీఈవో అడే గణేశ్ అన్నారు. బుధవారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘంలో రైతులు సభ్యత్వం నమోదు చేసుకుంటే వారికి వ్యవసాయానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఎఫ్‌పీవో ద్వారా రైతులు కలిసికట్టుగా తమ పంట ఉత్పత్తులను విక్రయించవచ్చాన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు తక్కువ ధరకే పొందవచ్చాన్నారు. సమూహంగా విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడం ద్వారా ఖర్చులు తగ్గుతాయన్నారు. భవిష్యత్‌లో రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు, రుణ సదుపాయం ఉంటుందన్నారు.

తాడిహత్నూర్‌ను సందర్శించిన ట్రైయినీ కలెక్టర్

నార్నూర్: మండలంలోని తాడిహత్నూర్ గ్రామాన్ని ట్రైయినీ కలెక్టర్ సలోనిచాబ్రా బుధవారం సందర్శించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. రికార్డుల వివరాలను పంచాయతీ కార్యదర్శి శేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పనితీరు చాలా బాగున్నాయని పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్‌క్రైం డీఎస్పీ హసీబుల్లా అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటీజన్ కార్యాలయంలో వయోవృద్ధులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ మోసగాళ్లు రిటైర్డ్ ఉద్యోగులను టార్గెట్ చేస్తున్నారని, అపరిచిత లింక్‌లను ఓపెన్ చేయవద్దని, గుర్తు తెలియని వారికి ఓటీపీలు షేర్ చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో దేవిదాస్ దేశ్‌పాండే, పోశెట్టి, గంగాధర్, శంకర్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

భారీ వర్షం.. ఉప్పొంగిన వాగులు

జిల్లాలో బుధవారం భారీ వర్షం కురిసింది. మంగళవారం రాత్రి నుంచి ఏకధాటిగా కురిసిన వర్షానికి వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహించాయి. దీంతో అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పలు గ్రామాల్లో పంటపొలాలు నీటమునిగాయి. భారీ వర్షానికి పలువురి ఇళ్ల గోడలు కూలిపోయాయి.

– సాక్షి నెట్‌వర్క్



కెరమెరి: నిండుకుండలా లక్మాపూర్ వాగు



దహెగాం: వరదలతో నీట మునిగిన పంటలు



పెంచికల్‌పేట్: అగర్‌గూడ -కమ్మర్‌గాం ప్రధాన రహదారిపై చేరిన వరద నీరు



కెరమెరి: పొంగి ప్రవహిస్తున్న అనార్‌పల్లి వాగు



ఆసిఫాబాద్‌రూరల్: ఉప్పొంగి ప్రవహిస్తున్న అప్పపల్లి వాగు



ఆసిఫాబాద్‌రూరల్: మోతుగూడలో చెరువును తలపిస్తున్న వరి పొలాలు



కౌటాల: తలోడి జీపీ కార్యాలయం ఎదుట నిలిచిన నీరు



రెబ్బెన: రేకులగూడలో కూలిపోయిన ఇల్లు



రెబ్బెన: ఎన్టీఆర్ నగర్‌లో ఇళ్ల మధ్య నిలిచిన నీరు



రెబ్బెన: నంబాల బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న వాగు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



తిర్యాణి: విజయనగరం బ్రిడ్జి వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న అధికారులు



కౌటాల: చింతలపాటి లోలెవల్ వంతెనను పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రమోద్

కౌటాల: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ప్రమోద్ అన్నారు. బుధవారం మండలంలోని చింతలపాటి లోలెవల్ వంతెనను ఆయన పరిశీలించారు. వార్ధా, పెన్‌గంగా, ప్రాణహిత నదులతో పాటు పలు వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయని, సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. భారీ వర్షాలతో ఇబ్బందులు ఉంటే కంట్రోల్ రూం అధికారులకు సమాచారం ఇవ్వాలని, 90520 41484, 90142 38200, 91826 33671 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఆయన వెంట ఎస్సై విజయ్, తదితరులు ఉన్నారు.

తిర్యాణి: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. మండలంలో మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో విజయనగరం గ్రామం వద్ద ఉన్న వాగు ఉప్పొంగి ప్రవహించడంతో బ్రిడ్జిపై నుంచి వరద నీరు పారుతోంది. ఎస్సై శ్రీకాంత్, ఎంపీడీవో మల్లేశ్, తహసీల్దార్‌తో కలిసి పరిస్థితిని సమీక్షించారు.

ముగింపు సభ జయప్రదం చేయండి

కాగజ్‌నగర్‌టౌన్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకుని ఆగస్టు 9 నుంచి తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని 94 గ్రామాల్లో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నేర్పల్లి అశోక్ అన్నారు. బుధవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని పట్టణంలోని బాలభారతి ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ముగింపు సభకు ఆదివాసీ గిరిజనులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షురాలు కొరెంగ మాలశ్రీ, జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్, నైతం రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం నాయకులు

రక్తదాన శిబిరానికి స్పందన

బోథ్: మండల కేంద్రంలోని పరిచయ గార్డెన్‌లో సామాజిక సేవకుడు, పీఏసీఎస్ డైరెక్టర్ చట్ల ఉమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై శ్రీసాయిలు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 130 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. చట్ల ఉమేష్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, అల్లకొండ పోతన్న, అబ్రార్ పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జికి మోక్షం

- నిర్మాణానికి రూ.9కోట్లు విడుదల
- టెండర్లు పూర్తి.. త్వరలో పనులు ప్రారంభం
- తీరనున్న మున్సిపాలిటీవాసుల కష్టాలు



దక్షిణ మధ్య రైల్వే జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు (ఫైల్)



రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్న సంజీవయ్య కాలనీ రోడ్డు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని సంజీవయ్య కాలనీ రోడ్డు నుంచి రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టనుండడంతో మున్సిపాలిటీ పరిధిలోని కాపువాడ, మారుతినగర్, సీబాబు కాలనీ ప్రజల కష్టాలు తీరనున్నాయి. కాగజ్‌నగర్ రైల్వే అండర్ బ్రిడ్జిని సంజీవయ్య కాలనీ నుంచి భట్టుపల్లి చౌరస్తా వరకు నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.9 కోట్లు నిధులు విడుదల చేసి టెండర్లను పూర్తి చేసింది. సికింద్రాబాద్‌లోని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీవాస్తవ్‌ను సిర్పూరు ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు కలిసి పనులను చేపట్టాలని కోరడంతో త్వరలోనే పనులను చేపట్టనున్నామని ఆయన తెలిపారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జితో ప్రయోజనం

కాగజ్‌నగర్ రైల్వే అండర్‌బ్రిడ్జితో కాపువాడ, మారుతినగర్, సీబాపు కాలనీ, భట్టుపల్లి, జీడిచేను ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఏచిన్న అవసరం ఉన్నా మార్కెట్‌కు రావాలంటే రైల్వే ఓవర్ బ్రిడ్జిపై నుంచి చుట్టూ తిరుగుతూ రావాల్సిన పరిస్థితి ఉంది. రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపడితే దూరం తగ్గడంతో పాటు సమయం ఆదా అవుతుంది. అంతే కాకుండా పెద్దవాగు సమీపంలో ఉన్న మోక్షదామానికి పార్థివ దేహాలను తీసుకువెళ్లాలంటే ఇబ్బందులు తప్పనున్నాయి.

తిరిగి వెళ్లాల్సి వస్తుంది..



నేను ప్రతీరోజు పని కోసం సీ బాపు కాలనీ నుంచి కాగజ్‌నగర్‌లోని మార్కెట్‌కు రావాలంటే రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి చుట్టూ తిరిగి రావాల్సిందే. అత్యవసరం ఉన్నప్పుడు రైలు పట్టాలు దాటి వెళ్లాల్సి వస్తుంది. రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మాణం చేపడితే చాలా సౌకర్యవంతంగా ఉంటుంది.

– శ్రీనివాస్, సీబాపు కాలనీ

పట్టాలు దాటి వెళ్తున్నాం..



రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపడితే సీబాపు కాలనీ, మారుతినగర్ కాలనీ వాసులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. బైక్‌లు లేనివారు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై నుంచి నడిచి వెళ్లలేక రైల్వే పట్టాలు దాటి నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తుంది. బిక్కుబిక్కుమంటూ పట్టాలు దాటాల్సిన పరిస్థితి ఉంది. కొన్నిసార్లు ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి.

– సుభాష్, సీబాపు కాలనీ

ఇబ్బందులు తొలగుతాయి..



రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో ఆటో డ్రైవర్లకు ఇబ్బందులు తొలగిపోతాయి. రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు సరైన రోడ్డు లేక ఫ్లైఓవర్ బ్రిడ్జి ఎక్కి కాపువాడ నుంచి రైల్వే స్టేషన్‌ఫ్లాట్ ఫాంకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అండర్ బ్రిడ్జి నిర్మిస్తే నేరుగా వెళ్లవచ్చు.

– సజ్జత్, ఆటో డ్రైవర్, కాగజ్‌నగర్

మాదకద్రవ్యాలకు యువత బానిస కావొద్దు

కాగజ్‌నగర్‌టౌన్: నాషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని నవోదయ పాఠశాలలో డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ రహిత లక్ష్యంగా ప్రతీ కృషి చేయాలన్నారు. మాదకద్రవ్యాలకు యువత బానిస కావొద్దన్నారు. విద్యార్థులతో డ్రగ్స్ నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. సీఐ ప్రేంకుమార్, ఎస్సైలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శారద అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల నిరోధక కమిటీ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల కలిగే దుష్ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల సీనియర్ అధ్యాపకులు జనార్దన్, దత్తాత్రేయ, అధ్యాపకుల పాల్గొన్నారు.

కెరమెరి: మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సై మధుకర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు జీవితాన్ని సర్వనాశనం చేస్తాయన్నారు. డ్రగ్స్ రహిత జీవనాన్ని గడపడానికి పోలీసు యంత్రాంగం పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. డ్రగ్స్ అమ్మడం, కొనుగోలు చేయడం, అక్రమ రవాణా చేయడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తే సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. విద్యార్థినులతో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ఎస్‌వో ప్రవీణ, టీచర్లు, ఉన్నారు.



కెరమెరి: ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్సై మధుకర్

వాంకిడి: మాదక ద్రవ్యాల వినియోగంతో కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయని ఎస్సై తులసీరాం, ఏఎస్సై పోశెట్టి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని శివాజీ చౌక్ వద్ద మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం రోజురోజుకు పెరుగుతుందని, వాటిని అరికట్టడం అందరు బాధ్యతగా తీసుకోవాలన్నారు. మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు దృష్టికి వస్తే వెంటనే 1908 నంబరుకు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్సై అనిల్ కుమార్ అన్నారు. నషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మండలంలోని ఎల్లూర్ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థులు సామాజిక బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



వాంకిడి: ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీస్ అధికారులు



పెంచికల్‌పేట్: విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు



కాగజ్‌నగర్‌టౌన్: ప్రతిజ్ఞ చేస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

మార్కోళ్ల సందడి



జిల్లాలోని కెరమెరి, లింగాపూర్ మండలాల్లోని గిరిజన గ్రామాల్లో మార్కోళ్ల సందడి ప్రారంభమైంది. జామురావుస్ (శ్రావణమాసం ప్రారంభం) పండుగ నుంచి పొలాల అమావాస్య తర్వాత నిర్వహించే బడిగ పండుగ వరకు యువకులు, పిల్లలు వెదురుతో తయారు చేసిన కర్రల ఆసరాతో నడుస్తుంటారు. ఇది అనాధిగా వస్తున్న ఆచారమని గ్రామపెద్దలు చెబుతున్నారు.

– కెరమెరి/లింగాపూర్

తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడిగా రాంషావ్

ఆసిఫాబాద్: తుడుందెబ్బ ఆసిఫాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా కొట్నాక రాంషావ్ నియమితులయ్యారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో నియామక పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్‌కుమార్ అందించారు.